సాక్షి నాగర్‌కర్నూల్


గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



నిధులు వచ్చేనా?

జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి వచ్చిన నిధులు రూ.25 కోట్లు వెనక్కి వెళ్లాయి.

వివరాలు 8లో ▸



తగ్గిన ఉల్లి ధరలు

ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం నిషేధించిన కారణంగా ఉల్లి ధరలు తగ్గుతున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.2 /11.6

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

క్యాంప్ కార్యాలయంలోకి ఎమ్మెల్యే



కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (ప్రజాభవన్)లోకి బుధవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి - సరిత దంపతులు గృహ ప్రవేశం చేశారు. ఈసందర్భంగా పండితుడు నర్వ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్య నారాయణస్వామి వ్రతం ఆచరించారు. కార్యక్రమానికి ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ హాజరై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రజాభవన్ సందడిగా మారింది.

వేరుశనగ క్వింటా రూ.7,319



కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగ విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి రైతులు 2,098 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌కు తీసుకురాగా.. గరిష్టంగా రూ.7,319, కనిష్ఠంగా రూ.4వేలు, మధ్యస్థంగా రూ.7,189 ధరలు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు తెలిపారు. 145 మంది రైతులు 6,996 బస్తాల వేరుశనగను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

విధులపై అలసత్వం వహిస్తే చర్యలు



అచ్చంపేట రూరల్: విధి నిర్వహణపై సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు హెచ్చరించారు. అచ్చంపేట మండలం ఐనోల్, సిద్ధాపూర్, చేదురుబావితండా, రంగాపూర్, దర్గాతండా పంచాయతీల్లో బుధవారం నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని, నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మండల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. రానున్న వేసవిలో నర్సరీల నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఓ వెంట ఎంపీఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి

కొల్లాపూర్: కొల్లాపూర్ మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సోమశిల రక్షిత మంచినీటి పథకం వద్ద ఉండే 100 హెచ్‌పీ మోటార్ ఏమైందని కౌన్సిలర్ సిబ్బది నర్సింహారావు అధికారులను ప్రశ్నించారు. ఈమేరకు వాటర్ లైన్‌మెన్లను అక్కడికి పిలిపించి అడగగా.. మరమ్మతుల కోసం తీసుకెళ్లి, తిరిగి తీసుకురాలేదని వివరించారు. అయితే ఎవరి ఆదేశాల మేరకు మోటార్‌ను మరమ్మతులకు తీసుకెళ్లారనే అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. అలాగే ఈదమ్మ జాతర నిర్వహణపై సభ్యులు చర్చించారు. పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఎజెండాను కమిషనర్ రాజయ్య ప్రవేశపెట్టారు. కాగా గతంలో చేపట్టిన పనులకు బిల్లులు విడుదల చేయాలని పలువురు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదా బేగం, కౌన్సిలర్లు, అధికారులు ఉన్నారు.



ఈ సారైనా..



కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి

- కృష్ణా-వికారాబాద్, గద్వాల-డోర్నకల్ లైన్‌కు గ్రీన్‌సిగ్నల్ పడినట్లేనా..
- 'పాలమూరు'కు ప్రత్యేక గుర్తింపు.. కేంద్ర విద్యాలయాలకు మోక్షం లభించేనా..?
- 'జోగుళాంబ'కు నిధులు విదిల్చేనా..
- ఆశల పల్లకిలో ఉమ్మడి పాలమూరు ప్రజలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పార్లమెంట్‌లో కేంద్రం గురువారం ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా.. ఈ దఫాలో బీజేపీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ కానుంది. ఈ నేపథ్యంలో ఓటరు ఆకర్షిత బడ్జెట్ ఉంటుందని అందరూ అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఉమ్మడి పాలమూరులోని రెండు లోక్‌సభ స్థానాలపై కమలం అధిష్టానం కన్నేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బడ్జెట్‌లో జిల్లాకు పెద్దపీట వేస్తారనే ఆశలో ప్రజలు ఉన్నారు. కృష్ణా-వికారాబాద్, గద్వాల-డోర్నకల్ లేన్లపై రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించేందుకు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అంగీకారం తెలిపిన క్రమంలో వీటికి బడ్జెట్‌లో చోటు లభించనున్నట్లు తెలుస్తోంది.

కృష్ణా-వికారాబాద్ ప్రాజెక్ట్‌పై ఆశలు

ఈ బడ్జెట్‌లో కృష్ణా-వికారాబాద్ రైల్వే లేన్‌కు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1988లో నారాయణపేట జిల్లా కృష్ణా నుంచి వికారాబాద్‌కు 87 కిలోమీటర్ల మేర రూ.90కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే ఈ లేన్ కోసం ఐదుసార్లు సర్వే చేశారు. ఈ ప్రాజెక్ట్ మంజూరు కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం నిధులు కేటాయించాలి. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ లేన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించేందుకు అంగీకారం తెలపడంతో ఈ రైల్వే ప్రాజెక్ట్ కోసం ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ లేన్ పరిధిలో 316 కిలోమీటర్ల వరకు సర్వే చేయనున్నారు. ఈ మేరకు రూ.7.91కోట్లు నిధులు కూడా కేటాయించారు. అయితే గతంలో ప్రతిపాదించిన ప్రకారం కాకుండా అలైన్‌మెంట్ మార్చి ఈ బడ్జెట్‌లో కృష్ణా-వికారాబాద్ లేన్‌కు నిధులు కేటాయించే అవకాశం ఉంది.

గద్వాల నుంచి డోర్నకల్‌కు సైతం..

గద్వాల-మాచర్ల నూతన రైల్వే లేన్ కోసం ఎన్నో ఏళ్ల నుంచి ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుమారు 220 కి.మీ.ల మేర నిర్మాణానికి రూ.190 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు మూడు పర్యాయాలు సర్వే చేశారు. కానీ ఎలాంటి ముందడుగు పడలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ లేన్‌పై సైతం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అలైన్‌మెంట్‌ను మార్చి గద్వాల నుంచి డోర్నకల్ వరకు 296 కి.మీ.ల మేర మరోసారి సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలపగా.. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

డోన్ వరకు పొడిగింపునకు..

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రాధాన్యత గల సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ లేన్ పనులు పూర్తయ్యాయి. 2015-16లో 85 కిలోమీటర్ల నిడివి గల ఈ ప్రాజెక్ట్ రూ.774 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైంది. కొన్నేళ్లుగా దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. దీంతో పనులు ముమ్మరంగా జరగడంతో సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య డబ్లింగ్ రైల్వే లేన్‌ను పూర్తి చేశారు. దీన్ని మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు పొడిగించేందుకు గత బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించగా.. పనులు కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. రైల్వే లేన్ నిర్మాణం పూర్తికి మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉంది.



మహబూబ్‌నగర్- డోన్ మధ్య పూర్తయిన విద్యుదీకరణ లైన్

వీటికి మోక్షం లభించేనా..

- ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదాపై గత కేంద్ర బడ్జెట్లలో ఊసే లేకుండా పోయింది. ప్రత్యేక హోదా సాధ్యం కాదని.. నిధులు కేటాయిస్తామని ఇటీవల కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు బడ్జెట్‌లో పాలమూరు ప్రస్తావన ఉంటుందా అనేది చర్చనీయాంశంగా మారింది.
- విద్యకు సంబంధించి ఉమ్మడి పాలమూరులో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. నారాయణపేట శివారు ఎక్లాస్‌పూర్‌లో 50 ఎకరాల స్థలాన్ని సైనిక్ స్కూల్‌కు కేటాయించగా.. గత బడ్జెట్లలో మొండిచేయి చూపిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.
- అచ్చంపేట మహబూబ్‌నగర్ - తాండూర్ వరకు 180 కి.మీల మేర కొత్త రైల్వే లేన్‌కు రూ.360 కోట్లతో గతంలో కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది కాగితాలకే పరిమితమైంది.
- 2007లో రూ.340 కోట్లతో ప్రతిపాదించిన జడ్చర్ల-నాగర్‌కర్నూల్-కొల్లాపూర్-నంద్యాల వరకు 170 కి.మీ.ల రైలు మార్గం ఆచరణలో అమలు కాలేదు.
- మహబూబ్‌నగర్-చించోళి, కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారి 167కే నిర్మాణం ఇప్పటికే మొదలైంది. ఇందుకోసం రూ.1,800 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభం కాగా, మొదటి విడత కింద రూ. 401 కోట్లు విడుదలయ్యాయి. మిగతా నిధులు విడుదల కావాల్సి ఉండడంతో పాటు సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తికావాల్సి ఉంది.

ప్రజలకు ఉపాధి అవకాశాలు



గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌కు సంబంధించి నిధులు కేటాయించాలని గతంలో పలుమార్లు కేంద్ర రైల్వేమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. గద్వాల- డోర్నకల్ మార్గాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతాం. అలాగే ఇక్కడి ప్రజల అవసరాలను కచ్చితంగా సంబంధిత రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తా. రైలు మార్గం ఏర్పడితే పరిశ్రమలతోపాటు వాణిజ్య, రవాణా పరంగానే కాకుండా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

– రాములు, ఎంపీ, నాగర్‌కర్నూల్

నిధులు కేటాయించాలి..



కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌ను ఆర్థిక బడ్జెట్‌లో విలీనం చేసింది. అయినా వెనకబడిన ప్రాంతాలకు తగిన కేటాయింపులు దక్కడం లేదు. తెలంగాణ వెనకబడిన ప్రాంతంగా నీతి ఆయోగ్ గుర్తించింది. ఈ మేరకు నిధులు ఇవ్వాలి. ఈ ప్రాంతంలో విద్య, ఉపాధి, ప్రయాణ సౌకర్యాల కల్పనకు ప్రోత్సహించాలి. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించి నిధులు కేటాయించాలి. చేవెళ్ల రెండో దశ నిర్మాణాన్ని సైతం ప్రారంభించి తూర్పు ప్రాంతాలకు నీళ్లు అందించాలి. కర్నూలు- మహబూబ్‌నగర్ రైల్వేలైన్ డబ్లింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలి.

– రాఘవాచారి, కన్వీనర్, పాలమూరు అధ్యయన వేదిక

కొత్త ప్రతిపాదన వచ్చింది..



గద్వాల- మాచర్ల రైల్వేలైన్ ముందడుగు పడకపోవడానికి గత రాష్ట్ర ప్రభుత్వ వైఖరే కారణం. గద్వాల- డోర్నకల్ మార్గం కొత్త ప్రతిపాదన తీసుకువచ్చింది. ఈ రెండింటినీ చేపట్టాలి. స్పెషల్ వెహికిల్ సిస్టమ్ (ఎస్‌పీవీ)లో.. లేదా జాయింట్ వెంచర్‌లో తీసుకోవచ్చు. కేంద్రం గతంలోనే డీపీఆర్ తయారు చేసి రూ.1,068 కోట్ల అంచనాతో లైన్ ప్రారంభించేందుకు నివేదికను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపింది. అంచనా వ్యయంలో నిబంధనల ప్రకారం 49 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది.

– సుధాకర్‌రెడ్డి, రైల్వే సాధన సమితి జిల్లా అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

తెలంగాణలో ఏకైక శక్తిపీఠానికి పెద్దపీట వేసేనా..

రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠం జోగులాంబ ఆలయానికి ప్రసాద్ స్కీం కింద గత బడ్జెట్‌లో సుమారు రూ.36.73 కోట్లు కేటాయించారు. ఈ మేరకు 3.03 ఎకరాలల్లో అధునాత భవన నిర్మాణంతోపాటు అన్నదాన సత్రం, కల్యాణ మండలం, భక్తులకు వాష్‌రూంలు, సాంస్కృతిక వేదిక, స్టాళ్లు. బస్టాండ్ నుంచి ఆలయం వరకు అప్రోచ్ రోడ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కేటాయిచిన వాటిలో రూ.18.52 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ప్రస్తుతం చేసిన పనులకు సంబంధించి ఇంకా సుమారు రూ.8 కోట్ల వరకు రావాల్సి ఉంది. కేటాయించిన మొత్తం నిధులు విడుదల చేయడమే కాకుండా.. మరిన్ని అభివృద్ధి పనులకు మరో రూ.50 కోట్లు కేటాయించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

అదనపు బడ్జెట్ అవసరం..



జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు కేంద్ర పురాతత్వ శాఖ పరిధిలో ఉన్నాయి. ప్రసాద్ స్కీం కింద ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం రూ.37 కోట్లు మంజూరు చేసినా పూర్తి నిధులు విడుదల చేయలేదు. అయితే ఈ ఆలయానికి యునెస్కో గుర్తింపు తేవడానికి, భక్త యాత్రికులకు కాశీ తరహాలో అన్నిరకాల అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా మరో రూ.50 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.

– వెంకటేశ్వర్‌రెడ్డి, జోగుళాంబ ఆలయ ధర్మకర్త, అలంపూర్

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకుసాగాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన తెలకపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషిస్తూ, నూతన పరిశోధనలు చేయాలన్నారు. రోజురోజుకూ సాంకేతికపరంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటిని అవగతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. కాగా గురుకులంలో విద్యార్థినులకు అందిస్తున్న మెనూ ఇతర వసతులపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల విభాగాలను సందర్శించేందుకు విద్యార్థినులకు కలెక్టర్ అనుమతినిస్తూ.. విభాగాల వారీగా విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు ఓ అధికారిని కేటాయించారు. గురుకుల పాఠశాల నిర్వహణ కమిటీకి ఎన్నికైన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ బయల్దేరిన స్టాఫ్ నర్సులు



కందనూలు: జిల్లాలో స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అభ్యర్థులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు హైదరాబాద్‌కు బయల్దేరారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా.. కలెక్టరేట్ ప్రాంగణం నుంచి డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, ఆర్టీసీ ఆర్ఎంఓ బాలసరస్వతి జెండా ఊపి సాగనంపారు. అనంతరం సుధాకర్‌లాల్ మాట్లాడుతూ జిల్లా నుంచి 242 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపిక కాగా.. 240 మంది హైదరాబాద్‌కు బయల్దేరినట్లు తెలిపారు. ఒకరు విదేశాల్లో, ఇంకొకరు అనారోగ్య కారణాలతో హాజరు కాలేకపోయారని పేర్కొన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవినాయక్, రేణయ్య, ఆర్టీసీ సీఐ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉంటా

- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మల్లురవి


కందనూలు/కల్వకుర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉంటానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి డా.మల్లురవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కల్వకుర్తి ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి వేర్వేరుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు తనకు ఆఫర్ రాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆసక్తితో సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పారు. నిత్యం ప్రజల మధ్య ఉండే తనకు పార్టీ తరపున ఎంపీగా పోటీచేసే అవకాశం లభిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై కేంద్రంలోని అధికారులతో చర్చించినట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, నాగర్‌కర్నూల్‌కు రైల్వేలైన్ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించేందుకుగాను ప్రత్యేక ప్రతినిధి పదవిని వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఊర్కొండ అభయాంజనేయ స్వామి ఉత్సవాలకు మల్లురవితో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, ఆనంద్‌కుమార్, ఆశాదీప్‌రెడ్డి ఉన్నారు.



కల్వకుర్తిలో మాట్లాడుతున్న మల్లురవి, చిత్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అన్ని రంగాల అభివృద్ధే లక్ష్యం

ఉప్పునుంతల: రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఉప్పునుంతల మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఉప్పరిపల్లి, జప్తీ సదగోడు గ్రామాల్లో పంచాయతీ, హెల్త్ సబ్‌సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఉప్పరిపల్లి - మామిళ్లపల్లి, కొరటికల్ - కాంసానిపల్లి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉప్పునుంతలలో రూ.2 కోట్లతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం హెల్త్ సబ్‌సెంటర్, సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. తాడూరు, వెల్టూరు గ్రామాల్లో జీపీ భవనాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, సీఈఓ లక్ష్మయ్య, డీసీఓ పత్యానాయక్, ఎంపీపీ తిప్పర్తి అరుణ, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భూపాల్‌రావు, వైస్‌ఎంపీపీ వెంకటేష్, సర్పంచులు ఇంద్రసేనారెడ్డి, మల్లారెడ్డి, సరిత, అలివేలు, సుగుణమ్మ, రమేష్ రెడ్డి, ఎంపీటీసీలు మల్లయ్య, కవిత, అనురాధ, పీఏసీఎస్ డీఈ చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

కందనూలు: అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి ఎర్రిస్వామి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీటీఓ మాట్లాడుతూ వాహనదారులు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఎంత అత్యవసర సమయంలోనైనా అతివేగం పనికిరాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాలతో ఏటా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు నవీన్, అనూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీటీఓ ఎర్రిస్వామి

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి 15 రోజుల పాటు కొనసాగనున్న పరీక్షలు
- హాజరు కానున్న 7,131 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

కందనూలు: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు గురువారం నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 15 రోజుల పాటు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లు కళాశాలలకు చేరాయి. పరీక్షల నిర్వహణపై ఇటీవల కళాశాలల ప్రిన్సిపాల్స్, డిపార్టుమెంటల్ అధికారులతో జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటరమణ సమావేశమై పలు సూచనలు చేశారు.

41 పరీక్ష కేంద్రాలు..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, ఎస్సీ, బీసీ గురుకులాలు) 56, ప్రైవేటు కళాశాలలు 20తో కలిపి మొత్తం 76 ఉన్నాయి. ఆయా కోర్సుల్లో 13,800 మంది విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసిస్తున్నారు. వృత్తివిద్య, సైన్స్ కోర్సులు అభ్యసిస్తున్న 7,131 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 41 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1నుంచి 5వ తేదీ వరకు మొదటి విడత, 6నుంచి 10వ తేదీ వరకు రెండో విడత, 11 నుంచి 15వ తేదీ వరకు మూడో విడతకు ఏర్పాట్లు చేశారు. అవసరమైన వసతులు, పరికరాలను సమకూర్చారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న కళాశాలలకు ఇతర కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈఏడాది నుంచి కొత్తగా ఆంగ్లం ప్రయోగ పరీక్షను ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష 17న బ్యాక్లాగ్ విద్యార్థులకు ఏర్పాటు చేశారు. 19న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించనున్నారు.

తనిఖీ బృందాలు ఏర్పాటు..

ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అక్రమాలు జరగకుండా జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరీక్షల కమిటీ, సైన్స్ బోధకుల కమిటీ, సీనియర్ ప్రిన్సిపాల్స్‌తో గల హైపవర్ కమిటీ బృందాలతో పాటు డిపార్టుమెంటల్ అధికారుల బృందాలు ప్రయోగ పరీక్షలను పర్యవేక్షించనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి..



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ సజావుగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కళాశాలలకు సూచనలు చేశాం. కేంద్రాల్లో వసతులు కల్పించేలా ఆదేశాలు ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించాం. విద్యార్థులకు నిర్దేశించిన తేదీల్లో పరీక్షలకు హాజరుకావాలి.

– వెంకటరమణ, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

• ఐదు నెలల క్రితమే వివాహం

ఉండవెల్లి: బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జాతీయ రహదారి కంచుపాడు శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా, జూపాడు బంగ్లా మండలం, మండ్ల గ్రామానికి చెందిన వడ్డె శివకుమార్(28), మానవపాడు మండలం పల్లెపాడుకు చెందిన వడ్డె నాగేశ్వరికి ఐదు నెలల క్రితం వివాహమైంది. ఈయన కర్నూల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య నెల రోజుల క్రితం పల్లెపాడుకు రాగా, మంగళవారం సాయంత్రం కర్నూల్ నుంచి పల్లెపాడుకు వడ్డె శివకుమార్ బైక్‌పై బయలుదేరాడు. కంచుపాడు శివారులోకి రాగా అదుపు తప్పి కిందపడడంతో అతని తల కు బలమైన గాయాలయ్యాయి. అతని కర్నూల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..

కందనూలు: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలోని పులిజాలలో మంగళవారం చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం పులిజాలకు చెందిన మత్స్యకారుడు అడివయ్య (39) గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. కాళ్లకు వల చుట్టుకుని మంగళవారం నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు సాయంత్రం కావడంతో మృతదేహాన్ని వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



యాదయ్య (ఫైల్)

కందనూలు: సరదాగా ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం తాగారు. ఇద్దరు ఇంటికి తిరిగి వచ్చారు. కానీ ఒకరు మాత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తిమ్మాజీపేట మండలం ఇప్పలపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. తిమ్మాజీపేట మండలం, ఇప్పలపల్లికి చెందిన పొట్ట యాదయ్యతో పాటు మరో ఇద్దరు మంగళవారం మద్యం తాగేందుకు ఇప్పలపల్లి నుంచి తిమ్మాజీపేటకు వెళ్లారు. ఇద్దరు మాత్రం ఇంటికి తిరిగి రాగా పొట్ట యాదయ్య (45) గ్రామ శివారులో మృతి చెంది పడి ఉన్నాడు. యాదయ్య రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం మృతుడి తమ్ముడు శివ, వ్యవసాయ పొలానికి వెళ్లగా పొలం వద్ద యాదయ్య మృతదేహం కనిపించడంతో పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులతో, స్థానికులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మా నాన్నను కలిసి తాగిన ఇద్దరు వ్యక్తులే చంపి ఉంటారని కుమారుడు శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మద్యం మత్తులో.. వ్యక్తి ఆత్మహత్య

కందనూలు: మద్యం మత్తులో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఏఎస్ఐ వజ్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశిటిక్యాలకు చెందిన అంచ హుస్సేన్ (46) తన భార్యకు బయటకు వెళ్తున్నానని చెప్పి మద్యం మత్తులో పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన తండ్రి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి తమ్ముడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ: అన్నదమ్ముల మధ్య గొడవలు చెలరేగి ఆవేశంతో పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడిన ఘటన పెద్దర్పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జిల్లెల వీరేశం (48), జిల్లెల నరేష్, అశోక్ అన్నదమ్ములు. వీరి మధ్య గత నెల 29న వారి ఇంటి భాగ పరిష్కార విషయంలో గొడవ అయ్యింది. ఇదికాస్త తీవ్ర మనస్పార్థాలకు దారి తీసింది. వీరిలో రెండో వాడైన జిల్లెల వీరేశం ఆవేశంతో పురుగు మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు అతన్ని చికిత్స జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మూడురోజుల నుంచి చికిత్స పొందుతున్న ఈయన బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ముస్తాక్‌అలీ కేసునమోదు చేసినట్లు తెలిపారు.

టీయూఎఫ్ఐడీసీ నిధులు వచ్చేనా?

• ఎన్నికల ముందు రూ.25కోట్లు మంజూరు
• రూ.2కోట్ల90లక్షలకే టెండరు ప్రక్రియ
• మిగిలిన నిధులు వెనక్కి వెళ్లినట్లేనా?
• నిధులు కాగితాలకే పరిమితమని ఎమ్మెల్యే ఆరోపణ



టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరై నిలిచిపోయిన రోడ్డు పనులు



పట్టణంలో పూర్తయిన సీసీరోడ్డు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ ద్వారా తీసుకువచ్చిన నిధులు రూ.25కోట్లు వెనక్కి వెళ్లినట్లేనని తెలుస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి టీఎఫ్ఐడీసీ ద్వారా రూ.25కోట్లు తీసుకువచ్చినట్లు ప్రకటించారు. అందుకు సంబంధించి రూ.2కోట్ల90లక్షల పనులకు టెండరు ప్రక్రియ పూర్తిచేసి కొన్ని పనులు చేపట్టారు. అంతలో ఎన్నికలు రావటం, ప్రభుత్వం మారింది. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాత్రం బీఆర్ఎస్ హయాంలో ఏ పనిచేసినా అది కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు రాలేదని కేవలం ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు జీఓలు తీసుకువచ్చారని విమర్శించారు. దీనిపై పూర్తి వివరాలిలా ఉన్నాయి.

⇨ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా మొత్తం 10 పనులకు రూ.25కోట్లు మంజూరైనట్లు గతేడాది సెప్టెంబర్ 12న కలెక్టర్ ప్రొసిడింగ్ విడుదల చేశారు. ఈ మేరకు అదే నెలలో టెండరు ప్రక్రియకు వెళ్లాల్సి ఉన్నప్పటికి జాప్యం జరిగింది. కేవలం రూ.2కోట్ల90లక్షల పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తిచేసి అగ్రిమెంట్ చేశారు. 10 పనులకు కేవలం రెండు పనులు మాత్రమే టెండరు పూర్తికావటంతో పనులను ప్రారంభించారు. 25వ వార్డులోని రవీందర్ ఇంటి నుంచి ఆల్మాస్ గార్డెన్ రోడ్డు జౌకీనగర్ కాలనీ ద్వారా రాంలాల్ పెట్రోల్ బంక్ వరకు పని చేయాల్సి ఉండగా మధ్యలోనే ఆగిపోయింది. ఇక 5వ వార్డులో వంశీ ఆస్పత్రి నుంచి ఎర్రగుట్ట డబుల్ బెడ్రూంల వరకు లైటింగ్ వేసే పని ప్రారంభం కాకముందే నిలిపివేశారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే..

ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకే నిధులు వచ్చినట్లు ప్రచారం చేశారు. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంతా కాగితాలకే పరిమితం అయ్యింది. అలాంటిదే టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు రావటం. ఆ నిధులు వస్తాయన్న గ్యారంటీ లేదు. మున్సిపాలిటీలో అవసరమైన పనులు ఏం కావాలో ప్రతిపాదనలు పెట్టాలని కౌన్సిలర్లకు సూచించా. వారి ప్రతిపాదనల ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.50కోట్ల వరకు నిధులు తీసుకువచ్చి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

పనులు నిలిపివేశారు

మంజూరైన నిధులలో ఎన్నికలకు ముందు టెండరు ప్రక్రియ కాస్త జాప్యం జరిగింది. పనులు ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. ఎందుకు నిలిపివేశారో మాత్రం తెలియటం లేదు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు తీసుకురావటం జరిగింది. ప్రస్తుత ఎమ్మెల్యే ఆ నిధులను తీసుకువచ్చి ప్రతిపాదించిన పనులు పూర్తిచేసేలా చూడాలి.

– లక్ష్మి, చైర్‌పర్సన్, మున్సిపాలిటీ జడ్చర్ల

స్పష్టత లేదు

టీయూఎఫ్ఐడీసీ ద్వారా మున్సిపాలిటీలో 10 పనులకు గతేదాది రూ.25కోట్లు మంజూరు చేస్తూ సెప్టెంబర్‌లో కలెక్టర్ ప్రొసిడింగ్ విడుదల చేశారు. మొత్తం 10 పనులకు కేవలం 2 పనులకే సకాలంలో టెండరు పూర్తయ్యింది. ఆ పనులు సైతం నిలిపివేయటం జరిగింది. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవటం వల్లే నిలిచిపోయాయి. మిగిలిన నిధుల గురించి ఉన్నతాధికారులు ఏమి చెప్పటం లేదు.

–మహమూద్‌షేక్, కమిషనర్, మున్సిపాలిటీ జడ్చర్ల

అనుమానాస్పద స్థితిలో ఇల్లు దగ్ధం



కృష్ణా: మండల పరిధిలోని ఆలంపల్లిలో బుధవారం ఉదయం మాజీ సర్పంచ్ చెన్నబసప్పగౌడ్ ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా.. మంటలు అదుపులోకి రాకపోవడంతో రెండు అంతస్తుల ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ యజమాని తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరోగ్యం బాగోలేకపోవడంతో రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి రాయచూర్‌కు వెళ్లాం. కాగా మా కుటుంబానికి ఇతర వ్యక్తులకు కొంత కాలంగా భూమి వివాదం ఉంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఇంట్లో మంటలు అంటుకున్నాయి. కాగా ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో మంటలు పూర్తిగా ఎగిసిపడే సమయంలో గ్రామస్తులు గమనించారు. ఆ తరువాత మాకు సమాచారం అందించారు. మేము ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చి, మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా.. ఉపయోగం లేకుండా పోయింది. ఇంట్లో 50 తులాల బంగారంతో పాటూ ఇటీవల పంట అమ్మడంతో వచ్చిన రూ.40 లక్షల నగదు, భూములకు సంబంధించిన విలువైన పత్రాలు, ధాన్యం మొత్తం మంటల్లో బూడిదయ్యిందని చెప్పారు. ఇంట్లో వైర్లు బాగానే ఉన్నాయని, షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశం లేదన్నారు. మాకు అనుమానాలు ఉన్నాయని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

• సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



మాగనూరు మండలం కొత్తపల్లిలో కంది రైతులతో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

కృష్ణా/ మాగనూర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యం అని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కృష్ణాలోని శ్రీక్షీరలింగేశ్వర ఆలయంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా ఈ పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. దేశంలో ఏ నాయకుడు చేయలేని సుదీర్ఘమైన పాదయాత్రను రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేశారని గుర్తుచేశారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని తాను పాదయాత్ర ప్రారంభించానని, దీని ద్వారా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునే విధంగా ప్రజల్లోకి వెళ్తున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో సాగు, తాగునీటితోపాటు పెండింగ్‌లో ఉన్న పునరావాస గ్రామాలకు నిధుల విడుదల కోసం కృషిచేస్తానన్నారు. రాష్ట్రంలో గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరిచి.. స్వప్రయోజనాల కోసమే పాటుపడ్డారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన సాగునీటిని అందించేందుకు త్వరలోనే శుభ వార్త వింటారన్నారు. అలాగే కొడంగల్– పేట నియోజకవర్గాల ప్రజలకు సైతం సాగునీరు అందించేందుకు 69 జీఓను అమలు చేసేందుకు ఇప్పటికే అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పాలమూరు పార్లమెంట్ పరిధిలో మొట్టమొదట పాదయాత్రను ఇక్కడి నుంచి చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, పేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, పటేల్ చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజుగౌడ్, గోపాల్‌రెడ్డి, పారేవుల విష్ణు, కృష్ణా మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మక్తల్ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్య పరిష్కరిస్తాం

ముంపు గ్రామాల సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాదయాత్ర మధ్యాహ్నం 2 గంటలకు మాగనూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోకి ప్రవేశించగా.. పార్టీ జెండాను ఆవిష్కరించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని, కేంద్రంలో బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతుందని దుయ్యబట్టారు. అనంతరం పాదయాత్ర వర్కూర్, రాత్రి 8 గంటలకు నేరడగం చేరుకోగా ప్రధాన కూడలిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

• క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకోవాలి
• ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



బహుమతులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కందనూలు: వ్యాయామంతో ఆరోగ్యం లభిస్తుందని.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ మీట్‌కు మంత్రి హాజరై మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే మెదడు చురుకుగా పనిచేస్తుందని.. తద్వారా నిర్దేశిత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, సైనికులు నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉంటారని.. ఎక్కడ ఏ సమస్య ఏర్పడినా వెంటనే చేరుకుని పరిష్కరిస్తారని కొనియాడారు. ఆటల్లో ఆసక్తి, ప్రతిభ ఉన్న వారికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను అభినందించారు. కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పెద్దఎత్తున స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఇదే తొలిసారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ఇతర శాఖల సిబ్బంది క్రీడల్లో భాగస్వాములయ్యే విధంగా చూస్తామన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర రావు, డీఎస్పీ మోహన్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల తొలగింపు సాధ్యమయ్యేనా?

• నేటి నుంచి కఠిన చర్యలు



జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో బెల్టుషాపుల కట్టడిపై చర్చిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

జడ్చర్ల: నియోజకవర్గంలో ఎక్కడా బెల్టు షాపులు కనిపించకూడదు, బెల్టు షాపులు కొనసాగితే కఠిన చర్యలు తప్పవు, బెల్టు షాపులకు మద్యం విక్రయించిన మద్యం దుకాణాలపై కూడా చర్యలు తీసుకుంటామంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. దీంతో బెల్టు షాపుల నిర్వాహణదారుల్లో ఆందోళన నెలకొంది. బెల్టు షాపులు ఫిబ్రవరి 1 నుంచి ఎక్కడా కనిపించకూడదని ఎమ్మెల్యే ఇప్పటికే డెడ్‌లైన్ విధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తమ నిర్ణయంపై మహిళలు సంతోషంగా ఉన్నారని, బెల్టు షాపులు అరికడితే ఎన్నో కుటుంబాలు బాగుపడుతాయని ఆయన ఇప్పటికే పలుమార్లు అనేక సమావేశాల్లో చెప్పారు. అంతేగాక బెల్టు షాపుల సమాచారాన్ని తనకు వాట్సాప్‌లో తెలియజేస్తే వారికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం ఇవ్వడంతో పాటు, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామన్నారు. దీంతో గురువారం నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బెల్టుషాపుల నిర్వహణపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఎస్పీ హర్షవర్ధన్ నియోజకవర్గ స్థాయి పోలీసులతో సమీక్ష నిర్వహించారు. బెల్టుషాపులతో పాటు గంజాయి, గుట్కా తదితర మత్తుపదార్థాల విక్రయంపై కూడా ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. దీంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కొన్ని మద్యం దుకాణాలు కేవలం బెల్టు షాపులకే మద్యం విక్రయించేందుకు ప్రత్యేకంగా కొనసాగుతున్నాయి. దీంతో వీరి పరిస్థితి కూడా ఆందోళనగా ఉంది. ఏది ఏమైనా బెల్టుషాపుల నిర్వహణకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి ఎంత వరకు కొనసాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

వివాహమైన 25 రోజులకే.. నవవధువు బలవన్మరణం



మీనాక్షి (ఫైల్)

కేటీదొడ్డి: వివాహమైన 25రోజులకే నవవధువు బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పూజారితండాకు చెందిన మీనాక్షిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా సర్వలపల్లితండాకు చెందిన రాజేష్‌కు ఇచ్చి జనవరి 6న వివాహం చేశారు. అప్పటి నుంచి భార్యాభర్తలు తల్లిగారి ఇంట్లోనే ఉన్నారు. భర్త జీవనోపాధి కోసం బెంగళూరుకు వెళ్దామని చెప్పాడు. ఆమెకు తల్లిదండ్రులను వదిలి వెళ్లడం ఇష్టం లేక నిరాకరిస్తూ వస్తుంది. ఈ క్రమంలో ఈనెల 28న రాత్రి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మీనాక్షి (19) మృతి చెందింది. తల్లి దేవసత్ నాగిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

• అదుపులో ఇద్దరు మహిళలు
• పరారైన నిర్వాహకుడు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్ఐ శ్రీకాంత్, కాలనీవాసులు తెలిపిన వివరాలిలా ఇలా.. గద్వాల పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలోని సురేష్‌కు చెందిన ఇంటిని కేటీదొడ్డి మండలానికి చెందిన వీరేష్ అద్దెకు తీసుకున్నాడు. కొన్ని రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం అర్ధరాత్రి తిరుపతికి చెందిన ఓ మహిళ, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన మరో మహిళను ఇంట్లో ఉంచి గేటుకు తాళం వేసి నిర్వాహకుడు వీరేష్ బయటకు వెళ్లాడు. గేటుకు తాళం వేసి ఉన్న ఇంట్లో తలుపులు తెరుచుకుని లైట్లు వెలుగుతుండటం కొందరు కాలనీవాసులు గమనించి మహిళలను విచారించారు. తమతో వ్యభిచారం చేయించేందుకు వీరేష్ ఇక్కడికి తీసుకొచ్చాడని వారు సమాధానం ఇచ్చారు. కాలనీలో తమను విచారిస్తున్నారని వీరేష్‌కు ఫోన్ చేసి చెప్పగా, కాలనీలోకి విటులను తీసుకొస్తున్న ఆయన బయటి నుంచి పరారయ్యాడు. కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరు మహిళలను ఆధీనంలోకి తీసుకున్నారు. వీరేష్ కోసం గాలిస్తున్నామని, దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్లతండాలో ఎక్సైజ్ అధికారులు, నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు చేశారు. ఇందులో 30 లీటర్ల సారా, 500 లీటర్ల బెల్లం ఊట, 20 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కంప్యూటర్ బ్యాటరీలు చోరీ

కోస్గి (మద్దూరు): మద్దూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో కంప్యూటర్స్ బ్యాటరీలు ఆరు చోరీకి గురైనట్లు పాఠశాల ఎఫ్ఏసీ హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి బుధవారం తెలిపారు. సోమవారం తరగతి గదుల పరిశీలనలో భాగంగా కంప్యూటర్స్ ఉంచిన పదోతరగతి బీ సెక్షన్ తరగతి గదిని పరిశీలిస్తే ఆరు కంప్యూటర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురైనట్లు తెలిపారు. అలాగే ఈ తరగతి గది కిటికీ చువ్వలు వంచి వీటిని తీసుకెళ్లినట్లు గుర్తించామన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారికి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు వాచ్‌మెన్ లేకపోవడంతో ఈ సంఘటన జరిగిందని పేర్కొన్నారు.

ఇనాం భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేత

• వాగ్వాదానికి దిగిన కొనుగోలు దారులు



తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన కొనుగోలుదారులు

దామరగిద్ద: ఇనాం భూమిపై ఎలాంటి అధికారం లేకుండా ఓ వ్యక్తి ఓఆర్‌సీ (ఆక్యుపెన్సి రైట్ సర్టిఫికెట్) పేరుతో 28 ఎకరాల భూమిని విక్రయించడానికి స్లాట్ బుక్ చేసుకోగా, సరైన రికార్డులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసిన ఘటన బుధవారం మండలంలో వెలుగుచేసింది. తహసీల్దార్ నాగజ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గత్ప శివారులోని సర్వే నంబర్ 117లో 16.35 ఎకరాలు, సర్వే నెంబర్ 118 లో 11.24 ఎకరాల భూమికి 60 ఏళ్ల క్రితం నుంచి తిమ్మణ చారి తండ్రి రామాచారి పేరున ఉంది. ఇప్పటి వరకు భూమి క్రయవిక్రయాలు చేసినట్లు రికార్డులు లేవన్నారు. 2022 నంబర్ 21న థర్డ్ పార్టీకి ఎండార్స్ చేసినట్లు ఉందన్నారు. సదరు వ్యక్తి వారసుడు కాని, టెనెంట్ రైట్స్ కలిగి లేరన్నారు. ఎలాంటి సంబంధం లేకుండా ఓఆర్‌సీ సర్టిఫికెట్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని 28.19 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకం పొందినట్లు తెలిపారు. పట్టాదారు పాస్తుబుక్‌తో కొనుగోలుకు సిద్ధమైన హైదరాబాద్‌కు చెందిన దుర్గాదేవి, క్రయ విక్రయదారులు స్లాట్ బుక్ చేసుకుని అమ్మకానికి పెట్టినట్లు తెలిపారు.

పంచనామాతో తేలిన వాస్తవం

భూమిని పంచనామ చేయగా కాస్తులో కుర్వహన్మప్ప, రమణబోయిన బస్సప్ప, బోయిని హన్మంతు, గోపాల, రాజు, భీమప్పతో పాటు వితలాపూర్, అంత్వార్‌కు చెందిన రైతులు ఉన్నట్లు తెలియజేశారు. థర్డ్ పార్టీకి చెందిన వ్యక్తి తనకు అధికారాలు లేకున్నా సరైన రికార్డులు చూపకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. రిజిస్టర్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం నుంచి తీసుకున్న రికార్డుల్లోను ఎలాంటి ఆధారాలు లేవన్నారు. 1955 ఇనాం యాక్ట్ ప్రకారం సంబంధం లేని వారు ఓఆర్‌సీ తీసుకునే హక్కులు లేవని ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని తహసీల్దార్ గుర్తు చేశారు.

తహసీల్దార్‌తో వాగ్వాదం

జనవరి 22న స్లాట్ బుక్ చేసుకున్న కొనుగోలుదారులు దుర్గాదేవి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉందని హైదరాబాద్‌లోని తన ఇంటి వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని స్లాట్ బుకింగ్‌లో పేర్కొన్నారు. కాగా పంచనామా పూర్తి అయ్యే సరికి రికార్డు పత్రాలపై అనుమానం రావడంతో స్లాట్ బుకింగ్ చేసిన సమయం దాటి పోయింది. దీంతో కొనుగోలుదారులు తిరిగి బుధవారం స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయలేనని అమ్మకందారుడికి భూమిపై హక్కులు లేవని కొనుగోలుదారు రమాదేవికి రాతపూర్వకంగా రాసిచ్చారు. దీంతో అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని తీసుకొచ్చామని ముందే విషయం చెప్పాల్సి ఉందని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం తహసీల్దార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి విషయాన్ని వివరించారు.

నంచర్ల వెటర్నరీ అసిస్టెంట్ సస్పెన్షన్

మహమ్మదాబాద్: నంచర్ల వెటర్నరీ అసిస్టెంట్ జనార్దన్ బుధవారం సస్పెండ్ అయ్యారు. మండల వైద్యాధికారి నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నంచర్ల వెంటర్నరీ అసిస్టెంట్‌గా జనార్దన్ విధులు నిర్వహిస్తున్నారు. ఈయన విధుల్లో ఎప్పుడూ మద్యం మత్తులో ఉండేవాడని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలోనే జనవరి 26న కూడా గణతంత్ర వేడుకలకు మద్యం తాగి వచ్చాడని గ్రామానికి చెందిన కొందరు ఆయనను అడ్డుకున్నారు. కొంత వాగ్వివాదం చోటుచేసుకోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ 1, Kalwa Rajaiah S/o Kalwa Narayana, R/ o H.No: 10-89, Main Road, Atmakur Mandal, Wanaparthy Dist. T.S., hereby state that I have changed my name from Kalwa Raju S/o Kalwa Narayana (Old Name) to Kalwa Rajaiah S/o Kalwa Narayana (New Name). Cell: 9849196644

■ 1, Iram Fathima D/o Khaja Nizamuddin, R/o H.No: 19-29, SVP Nagar, Badepally, Jadcharla Town, Mahaboobnagar Dist.T.S., hereby state that I have changed my name from Erum Fatima D/O Khaja Nizamuddin (Old Name) to Iram Fathima D/o Khaja Nizamuddin (New Name). Cell: 8074561616

WANTED

■ ఒమేగా హోమ్స్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 20k ఫోన్: 8977839682/8977839683.

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి తగిన ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం ఉండదు. బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. – సాక్షి మేనేజ్‌మెంట్

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- అన్ని జిల్లాల్లోని సచివాలయాల్లో మొదలైన కార్యక్రమం
- తొలి రోజే పదివేల డాక్యుమెంట్లు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ కార్యక్రమంలో పంపిణీ చేసిన 30.61 లక్షల ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. తొలిరోజే పది వేల డాక్యుమెంట్లు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాల్సిన అవసరం ఉండదని స్పష్టంగా ముద్రించారు. స్థలానికి సంబంధించి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను వారి పేరు మీద చెల్లించుకోవచ్చని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూసేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మొట్టమొదటగా తాతపూడి అప్పాయ మ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ విలువ రూ.4.46 లక్షలు కాగా, భూసేకరణ విలువ రూ. 11.61 లక్షలుగా అందులో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీ, యూజర్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన రూ. 11.61 లక్షల విలువైన ఆస్తికి సాధారణంగా అయితే ఆమె రూ. 18,600 స్టాంప్ డ్యూటీ, రూ. 2,325 రిజిస్ట్రేషన్ ఛార్జి, రూ. 500 యూజర్ ఛార్జి కలిపి మొత్తం రూ. 21,425 చెల్లించాల్సి ఉంటుంది. దానిని ప్రభుత్వమే భరించింది.

15 రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి..
పదిహేనురోజుల్లో 30.61 లక్షల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లను మరింత వేగంగా చేయనున్నారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత ఆ డాక్యుమెంట్లను (కన్వేయన్స్ డీడ్స్) లబ్ధిదారులకు అందించనున్నారు. రూ. 10 స్టాంప్ పేపర్లపై ఈ డీడ్ల ప్రింటింగ్‌ను రిజిస్ట్రేషన్లు అయినదాన్ని బట్టి జిల్లాల్లోనే చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి మూడో వారంలో ఈ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత నియోజకవర్గాలు, సచివాలయాల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఈ డీడ్స్‌ను పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

సీఎం జగన్ నేతృత్వంలో కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

టీచర్ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు.. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల


మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ - 2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖతో పాటు గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ స్థాయిలో బోధన కొనసాగేలా భారీగా ఉపాధ్యాయులను నియమించనుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిబ్రవరి 16న నుంచి చివరి విడత ‘వైఎస్సార్ చేయూత’ పంపిణీ చేపట్టనున్నారు. సుమారు 27 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం రూ.5,060.40 కోట్లు జమ చేయనుంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

2.20 లక్షల శాశ్వత ఉద్యోగాలు!

మెగా డీఎస్సీ 2024లో భాగంగా ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. అంతకంటే ముందు 8 రోజుల పాటు డీఎస్సీ అర్హత కోసం టెట్ పరీక్ష నిర్వహిస్తాం. డీఎస్సీ 2024 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు కల్పించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క విద్యా రంగంలోనే 14,219 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానాన్ని తేవడంతో 7,761 పోస్టుల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారు. డీఎస్సీతో పాటు అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లతో సహా వివిధ విభాగాల్లో 689 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నాం. ఇలా వివిధ శాఖల్లో కలిపి ఇప్పటికే 2.13 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించాం. తాజా నోటిఫికేషన్ల ద్వారా మరో 7 వేల పోస్టులతో కలిపి 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించినట్లు అవుతుంది.

ఎస్ఈఆర్టీతో ఐబీ భాగస్వామ్యం..

పేదలకు, సంపన్నులకు తేడా నాణ్యమైన విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ తీసుకొస్తున్నాం. ఐబీ విద్యా విధానంలో చదవడానికి ఏడాదికి రూ.7 లక్షల నుంచి రూ.36 లక్షల దాకా ఖర్చవుతుంది. సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే డిజిటల్ సదుపాయాలు, ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లను పేద పిల్లలకు కూడా అందుబాటులోకి తేవడంతో మార్పు మొదలైంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ బోధనలో ఐబీని భాగస్వామ్యం చేస్తున్నాం. ప్రభుత్వంతో ఒప్పందానికి ఐబీ సంస్థ ముందుకు వచ్చింది. 2025–26 విద్యా సంవత్సరం జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ మొదలవుతుంది. 2026–27 విద్యా సంవత్సరం నాటికి రెండో తరగతికి విస్తరిస్తాం. 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి ప్లస్ 2 తరగతి విద్యార్థులు ఐబీ బోర్డు జాయింట్ సర్టిఫికేషన్‌తో పరీక్షలు రాస్తారు.

మరికొన్ని అంశాలకూ ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగింపు.
- ప్రతి గ్రామ పంచాయితీకి పంచాయతీ కార్యదర్శి ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ డిస్కమ్‌లకు రూ.1,500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీ.
- అత్యంత మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌కు ఆమోదం.

ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఇందులో భాగంగా గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1,500 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1,272.07 ఎకరాలు, మిడ్తూరు మండలం మాసాపేట, నాగలూటి గ్రామాల్లో 1,011.44 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములను గుర్తించనుంది. సోలార్, విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఎస్‌పీవీ ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి



సాక్షి, అమరావతి: ఏపీలో మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం వెల్లడించారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ.. సామాజిక న్యాయం చేస్తూ... యువతకు పెద్దపీట వేస్తూ ఐదో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు ఆ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తిరుపతి లోక్‌సభ స్థానానికి ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తిని నియమించారు. అరకు వ్యాలీ(ఎస్టీ) శాసనసభ స్థానం సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం, సత్యవేడు(ఎస్సీ)కు నూకతోటి రాజేష్, అవనిగడ్డకు ప్రముఖ వైద్యుడు సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ జాబితాతో కలిపి ఇప్పటివరకూ 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు కొత్తగా సమన్వయకర్తలను నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 17 మంది బీసీలు, నలుగురు మైనార్టీలు, 14మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 13 లోక్‌సభ స్థానాల్లో బీసీలు ఏడుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు ముగ్గురు ఉన్నారు.

3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు



తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్నవయసు నుంచే చిన్నారుల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీన్లో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు వచ్చేందుకు సమ్మతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయం నుంచి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని ఛైర్మన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి రావెల

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు దంపతులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కిషోర్ బాబు, ఆయన సతీమణి శాంతి జ్యోతి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ బడుగు బలహీన వర్గాల వారి తరఫున నిలిచారని, సమాజంలో అసమానతలు రూపుమాపుతున్నారని అన్నారు. అందువల్లే వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు.

నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని సీఎం జగన్‌ను అడగలేదు. పార్టీ కోసం ఏలా సేవలందించమంటే అలా చేస్తానని చెప్పా. ఎలాంటి కండిషన్ లేకుండా పార్టీలో చేరాను. సీఎం జగన్ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తా. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సీఎం జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తా అని చెప్పారు.

తగ్గిన ఉల్లి ధరలు



దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్‌యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున అమ్మకానికి తేవడంతో మార్కెట్ ఆవరణ అంతా ఉల్లి కుప్పలతో నిండిపోయింది. దాదాపు 5వేల బస్తాల ఉల్లి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు వేలం కొనసాగాయి. వానాకాలం తర్వాత ఉల్లి ధరలు బాగా పెరిగినా, రెండు నెలల నుంచి తగ్గుతూ వస్తున్నాయి. ఈ ఏడాది రైతులు పెద్ద మొత్తంలో ఉల్లిని సాగు చేయడంతో దిగుబడులు బాగా పెరిగాయి.

నాణ్యమైన ఉల్లి క్వింటాల్ రూ.1,600
మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో నాణ్యమైన ఉల్లికి అధికంగా రూ.1,600 వరకు క్వింటాల్ ధర పలకగా కనిష్ఠంగా రూ.1,100 వరకు ధర వచ్చింది. ఇక రెండో రకం ఎర్ర ఉల్లికి గరిష్ఠంగా రూ. వెయ్యి, కనిష్ఠంగా రూ.700 వరకు ధరలు లభించాయి. ఇక స్థానిక వ్యాపారులు మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఉల్లిని 45 కేజీల బస్తాలుగా తూకం వేసిన తెల్ల ఉల్లికి గరిష్ఠ ధర రూ.800, కనిష్ఠంగా రూ.550 వరకు వినియోగదారులకు విక్రయించారు. ఎర్ర ఉల్లి బస్తా ధర గరిష్ఠంగా రూ. 500, కనిష్ఠంగా రూ. 350 వరకు అమ్మకాలు సాగించారు.

కందుల ధర రూ.9,959
దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లి వేలం తర్వాత మధ్యాహ్నం నిర్వహించిన టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,959, కనిష్ఠంగా రూ.7,029 ధరలు వచ్చాయి. మార్కెట్‌కు వంద బస్తాల వరకు కందులు అమ్మకానికి వచ్చాయి.

ఇరువర్గాల మధ్య వివాదం

జడ్చర్ల: పట్టణంలోని శ్రీలక్ష్మీకాలనీలో బుధవారం ఓ ప్రార్థనా మందిరం ప్రహరి నిర్మాణ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. కాలనీలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఏఎస్పీ రాములు, అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఇరువర్గాల ముఖ్యులతో చర్చలు చేశారు. ఆలయం పక్కనే ఓ వర్గానికి సంబంధించిన వారి వైకుంఠదామం ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు ఆలయం ఎదుట విశాలమైన రోడ్డు విడిచిపెట్టాలని ఓ వర్గం వారు డిమాండ్ చేశారు. దీంతో రోడ్డును వదిలిపెట్టి ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా కొందరు ప్రహరీని కూల్చివేయడంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించి పోలీస్‌స్టేషన్‌లో చర్చల ద్వారా ఒప్పించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

అన్నదాన సత్రంలో కొత్త ఒరవడి

- శివ మాలధారులకు, సామాన్య భక్తులకు ఏకకాలంలో భోజనాలు
- జనవరిలో అన్నదాన సత్రానికి రూ.6లక్షల ఆదాయం

జోగుళాంబ శక్తిపీఠం : అలంపూర్ ఆలయంలో కొనసాగుతున్న అన్నదాన సత్రంలో నెల రోజుల నుంచి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. రోజుకు 200 మందికి మాత్రమే భోజనం పెట్టే ఈ సత్రం ఇకపై రోజుకు వెయ్యి మందికి తగ్గకుండా అన్నదానాలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అన్నదానం మెనూలో కూడా మార్పులు చేశారు. చెట్నీ, కర్రీ, స్వీటు, పప్పు, సాంబార్ లేదా చారు, అలాగే మజ్జిగ వంటి మెనూతో భక్తులకు రుచికరమైన భోజనాలు అందించాలని సూచించారు. ప్రస్తుతం శివ మాలలాధారణ చేయడంతో వారికి లోపల టేబుల్ సిస్టం ఏర్పాటు చేసి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేసి, అదే సమయంలో సామాన్య భక్తులకు చలువపందిళ్ల కింద ఏకకాలంలో అదే మెనుతో అన్నదానాలు చేసేందుకు ఏర్పాటు చేశారు.


శివమాలధారులకు అన్నదానాలు

గత నెలతో పోలిస్తే..
డిసెంబర్‌లో 13,800 మంది భక్తులు, జనవరిలో 15,544 మంది భక్తులు భోజనం చేశారు. అదేవిధంగా డిసెంబర్‌లో రూ.3,84,301, జనవరిలో రూ.6,01,0114 దాతలు అన్నదాతన సత్రానికి అందజేశారు.

రుచికరంగా ఉన్నాయి..



ఆలయంలో పిలిచి మరీ భోజనాలు పెడుతున్నారు. పదార్థాలు ఎంతో రుచికరంగా ఉన్నాయి. ఇక్కడ స్థలం తక్కువగా ఉండటం చేత ఏకకాలంలో భక్తులంతా ఒకే సారి కూర్చోలేని పరిస్థితి ఉంది. ఈ విషయంలో అధికారులు కొంత దృష్టి సారించాలి.
– ఎం.లత, భక్తురాలు, సిద్దిపేట

శివమాలధారులకు ఆదరణ బాగుంది..



నేను శివదీక్ష స్వీకరించాను. అలంపూర్ ఆలయాలు సందర్శించేందుకు వచ్చాను. మధ్యాహ్నం ఇక్కడ దేవస్థానంలో భిక్ష ఉంటుందని తెలిసింది. ఇక్కడే భోజనం చేశాను. శివదీక్ష తీసుకున్న భక్తులకు ఇక్కడ ఎంతో ఆదరణ ఉంది.
– వెంకటేష్, ఎంఎస్ పల్లి, గద్వాల

భక్తులు సహకరిస్తున్నారు..



ఆలయంలో నిత్యాన్నదాన సత్ర నిర్వహణకు భక్తులు బాగాసహకరిస్తున్నారు. భక్తులకు ఇక్కడ లేదు అనకుండా అన్నదానాలు చేయమని ఈవో ఆదేశించారు. కేవలం మధ్యాహ్నం వేళలో మాత్రమే భోజనాలు ఉంటాయి. అన్నదానానికి భక్తులు విరివిగా సహకరించాలని కోరుతున్నాం.
– ప్రదీప్, అన్నదాన సత్రం ఇన్‌చార్జ్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అసంఘటిత రంగంలోని హమాలీ, మిల్లు కార్మికులకు ఉపాధితో కూడిన సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐదో మహాసభలు నిర్వహించారు. అంతకుముందు కొత్తగంజ్ నుంచి తెలంగాణచౌరస్తా మీదుగా రోజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు కార్మిక ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణతో మిల్లులు పెరుగుతున్నా కార్మికులకు భద్రతాచర్యలు తీసుకోవడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచడంతో కార్మికులు, సామాన్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా కనీస వేతనాల జీవో నం.73ను సవరించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు రూ.26 వేలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వెంకటేష్, రాంచందర్, అరుణ్‌కుమార్, దేవదానం, సాంబశివుడు, నర్సింహులు, దాసు, కొండన్న, బీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, ఎగుమతిదారులతో శాస్త్రవేత్తల సమీక్ష

కందనూలు: బిజినేపల్లి మండలం పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని ఆడిటోరియంలో రైతులు, ఎగుమతిదారులతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధన సంచాలకులు రఘురామ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లాలో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పండిస్తున్నారని చెప్పారు. రైతులు నాణ్యమైన విత్తనం ఎంచుకోవడం, విత్తన శుద్ధి చేసుకోవడం, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ పంటల్లో అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. విస్తరణ సంచాలకులు సుధారాణి మాట్లాడుతూ.. రైతులే స్థానికంగా ఉండే విత్తన క్షేత్రాలలో విత్తనోత్పత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే చీడ, పీడలను సమయానుకూలంగా గమనించి సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిశోర్, వాణిశ్రీ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విరివిగా ప్రచారం చేయండి
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో ఈనెల 14నుంచి జోగుళాంబదేవి వసంత పంచమి బ్రహ్మోత్సవాలతో పాటు వచ్చే నెలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే విజయుడు అధికారులకు సూచించారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి వసంత పంచమి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విరివిగా ప్రచారం చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కాగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుంచి అలంపూర్ ఆలయాలకు భక్తుల రాక పెరిగిందని, హైదరాబాద్ నుంచి అలంపూర్‌కు నేరుగా బస్సు సౌకర్య కల్పించాలని మున్సిపల్ ఛైర్మన్ భర్త వెంకటేష్ ఎమ్మెల్యేను కోరగా.. సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించినట్లు తెలియజేశారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలకు ఆచారాలతో పాటు ప్రచారాలు కూడా అవసరమని, అమ్మవారి నిజరూప దర్శనం ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఉంటుందని.. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ పిలుపునిచ్చారు.

హుండీ ఆదాయం రూ.18,31,708

అలంపూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. గతనెల 3న చేపట్టిన హుండీ లెక్కింపులో సమయాభావం కారణంగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు జరగలేదు. బుధవారం దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో హుండీని లెక్కించగా.. రూ.18,31,708 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.47,780 ఆదాయం సమకూరింది.

మొరాయించిన కౌంటింగ్ మిషన్..
హుండీ లెక్కింపులో భాగంగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ మిషన్ మొరాయించడంతో అధికారులు, భక్తులు తప్పనిసరి పరిస్థితిలో డబ్బులను చేత్తో లెక్కపెట్టాల్సి వచ్చింది. ఈవిషయమై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా.. పాత నోట్లు ఒకదానికి ఒకటి అతుక్కుని ఉండటంతో మిషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు. అయినప్పటికీ జాగ్రత్తగా లెక్కింపు ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటరామయ్యశెట్టి, సత్యనారాయణ, కాశన్న, సి.వెంకటేష్, ఏపీజీవీబి బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


హుండీ డబ్బులను లెక్కిస్తున్న భక్తులు

ప్రొ.గిరిజ సేవలు మరువలేనివి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రొ.గిరిజ సేవలు మరువలేనివని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ గిరిజ ఉద్యోగ విరమణ కార్యక్రమం లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రసంగించారు. కొన్నేళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని, ప్రస్తుతం వారు వివిధ స్థానాల్లో కొనసాగుతుండడం గొప్ప విషయం అన్నారు. అంతేకాకుండా ఆమె తీసుకున్న పలు నిర్ణయాలు పీయూ అభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించాయని, ఆమె పనితీరు ఇక ముందు వచ్చే అధికారులకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ గిరిజను సన్మానిస్తున్న వీసీ తదితరులు